
యూజీడీ పనుల ప్రారంభోత్సవంలో చైర్‌పర్సన్ జయశ్రీ, వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణరెడ్డి, అనుపమా తదితరులు

రూ.37లక్షలతో యూజీడీ పనులు

● ప్రారంభించిన చైర్‌పర్సన్ జయశ్రీరాజు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు తెలిపారు. బుధవారం కుంట్లూర్ 24వ వార్డు వెంకటేశ్వరకాలనీలో రూ.37లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులను వైస్‌చైర్‌పర్సన్ చామ సంపూర్ణావిజయశేఖర్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ కందాడ అనుపమాసుప్రసేనారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ పాలకవర్గం సమిష్టి కృషితో అన్ని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలకు స్వీకారం చుట్టినట్లు తెలిపారు. పాలకవర్గం పదవి కాలం కూడా దగ్గర పడుతుండడంతో అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. కౌన్సిలర్ మాట్లాడుతూ వార్డు పరిధిలోని చాలా కాలనీల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన పనులను కూడా పదవి కాలం ముగిసేలోగా పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు చెవుల హరిశంకర్‌ముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్, డీఈఈ సుమంత్, నాయకులు కొండల్‌గౌడ్, శ్రీరాములు పాల్గొన్నారు.


ఎరువుల గోదాంకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ భరత్‌కుమార్

రైతులకు అండగా సహకార సంఘం : చైర్మన్

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా బాటసింగారం రైతుసేవా సహకార సంఘం పని చేస్తుందని చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని బాటసింగారం రైతుసేవా సహకార సంఘం ఆవరణలో బుధవారం ఎరువుల గోదాంకు పాలకవర్గంతో కలిసి చైర్మన్ భరత్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పాత సహకార భవనం కనుమరుగవుతుందన్నారు. దీంతో ఎరువులు నిల్వ చేసేందుకు ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని సహకార సంఘం ఆవరణలోని ఖాళీ స్థలంలో గోదాం నిర్మాణానికి పాలకవర్గం చర్యలు చేపట్టిందన్నారు. త్వరితగతిన గోదాం నిర్మాణం చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. రైతు సంక్షేమానికి తమవంతు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు మల్లమ్మజంగయ్యయాదవ్, డైరెక్టర్లు యాదిరెడ్డి, బాల్‌రెడ్డి, గంట శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, రాములుయాదవ్, లక్ష్మమ్మ, మహిపాల్‌రెడ్డి, బ్యాంక్ మేనేజర్ ఐలేష్‌యాదవ్ పాల్గొన్నారు.


బస్తీ దవాఖానాలో వైద్యులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

బస్తీ దవాఖానాలో సదుపాయాల కల్పనకు కృషి

కొత్తపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజయ్ నివాస్-1 బస్తీ దవాఖానాలో మరిన్ని సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన బస్తీ దవాఖానాను సందర్శించారు. దవాఖానాలో వైద్య సేవలు, పేషంట్లకు వైద్య సహాయం తదితర అంశాలను ఆయన వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల అనారోగ్య సమస్యలను దూరం చేసేలా తగిన సూచనలు సలహాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కొత్తపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ సౌమ్య, బస్తీ దవాఖానా ఇన్‌చార్జి డాక్టర్ రేష్మా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే : ఎంపీడీవో

అబ్దుల్లాపూర్‌మెట్ : ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీవాణి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, లష్కర్‌గూడ గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వేయర్లకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు సర్వే కొనసాగుతుందన్నారు. ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వచ్చి సర్వే వివరాలు నమోదు చేసుకుంటారని తెలిపారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులతో పాటు ప్రజలు సర్వేయర్లకు సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, బబితా తదితరులు పాల్గొన్నారు.


లష్కర్‌గూడలో మొబైల్ యాప్‌లో నమోదు చేసిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే వివరాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీవాణి

సరూర్‌నగర్ చెరువులో గుర్రపు డెక్క తొలగింపు

సైదాబాద్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు పనులను బుధవారం ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డి పరిశీలించారు. గుర్రపు డెక్కతో దోమలు వృద్ధిచెంది పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దోమల నివారణకు ఒక వైపు చర్యలు తీసుకుంటూనే, గుర్రపు డెక్క పనులు నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈలు భారతి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత

ఎన్ఐఐఎంహెచ్ ఆధ్వర్యంలో ఆయుర్వేద శిబిరం


ఆయుర్వేద పద్ధతులను వివరిస్తున్న వైద్యులు

సైదాబాద్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్(ఎన్ఐఐఎంహెచ్) ఆధ్వర్యంలో దేశ్‌కా ప్రకృతి పరిక్షాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం రెవిన్యూబోర్డు కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆయుర్వేద శిబిరం నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రకృతి, వ్యాధి నివారణలో ఆయుర్వేద ప్రాముఖ్యతపై సంస్థ రీసెర్చ్ ఆఫీసర్లు (ఆయుర్వేదం) డాక్టర్ సంతోష్ ఎస్ మానే, డాక్టర్ క్రిస్ ఆంటోనీలు వివరించారు. ఈ శిబిరంలో 30 మంది పరీక్షలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్లు దీపిక, అంజన, గోపిక, లైబ్రేరియన్ శ్రీనివాస్‌రావు, కాలనీ ప్రతినిధులు హనుమారెడ్డి, అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

స్థలం ఒకరిది.. నిర్మాణం మరొకరిది..!

● జిల్లెలగూడ న్యూగాయత్రీనగర్‌లో ప్రైవేటు వ్యక్తుల ఇష్టారాజ్యం
● ఉన్నతాధికారులకు స్థానికుల ఫిర్యాదు
● కూల్చివేతకు సిద్ధమైన అధికారులు

సరూర్‌నగర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అది ఎవరి ప్లాటో తెలియదు.. సొంతదారుడు ఎవరో తెలియదు.. అయినా ఎలాంటి పత్రాలు లేకుండా, అధికారికంగా మునిసిపల్ అనుమతులు తీసుకోకుండా ఏకంగా అక్కడ ఓ భవన నిర్మాణమే జరుగుతోంది. దీనిపై స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే.. కూల్చి వేయాల్సిందిగా మునిసిపల్ అధికారులను ఆదేశించారు. తీరా మునిసిపల్ అధికారులు అక్కడకు వెళ్తే ఓ పార్టీకి చెందిన రాజకీయ నాయకులు అడ్డుకుని మునిసిపల్ సిబ్బందిని తిట్టి వెనక్కి పంపించారు. మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడలోని న్యూగాయత్రీనగర్ కాలనీలో ఈ సంఘటన చోటు చేసుకుంది.

యజమాని ఎవరో ?

న్యూగాయత్రీనగర్‌లోని రోడ్డు నంబర్2లో గల ప్లాటు నంబరు.31ఎస్(267 చదరపు గజాలు) యజమాని ఎవరన్నది తెలియదు. 30 సంవత్సరాల నుంచి సదరు ప్లాటు వద్దకు ఎవరూ రావడం లేదు. దాంతో కొందరు కబ్జాదారుల కన్ను దానిపై పడింది. వెంటనే కొన్ని తప్పుడు పత్రాలు సృష్టించి, వాటిని అడ్డుపెట్టుకుని అక్కడ భవనం నిర్మించడానికి ఉపక్రమించారు. ప్లాటును చదును చేస్తున్నప్పుడే కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మీర్‌పేట్ మునిసిపల్ అధికారులకు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు, సీడీఎంఏకు దీనిపై ఫిర్యాదు చేశారు. ప్లాటు సొంతదారుడు వచ్చిన తర్వాత అతడి వద్ద ఉన్న పత్రాలను పరిశీలించి యజమాని ఎవరన్నది నిర్ధారించుకున్న తర్వాతే అన్ని అనుమతులతో నిర్మాణం చేపట్టేలా చూడాలని వారు అధికారులను కోరారు. ప్రస్తుతం కబ్జాదారులు జరుపుతున్న అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. గత మూడు నెలల నుంచి కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు జె.మల్లారెడ్డి, పి.సుధాకేశవ్, చంద్రశేఖర్‌రెడ్డి, వంటేరు నర్సింహారెడ్డి, ఆంజనేయులు, శ్రావణ్ తదితరులు దీనిపై పోరాడుతున్నారు.

కూల్చివేతను అడ్డుకున్న నేతలు

ఈ ప్లాటుకు సంబంధించిన పత్రాలు లేకుండా, అక్రమంగా భవనం నిర్మిస్తున్నారని నిర్ధారించుకున్న మునిసిపల్ అధికారులు తమ సిబ్బందితో కలిసి మంగళవారం సదరు నిర్మాణాన్ని కూల్చి వేయడానికి ఎక్స్‌కవేటర్‌తో అక్కడకు చేరుకున్నారు. అక్రమంగా నిర్మించిన పిల్లర్లను తొలగించడానికి ప్రయత్నిస్తున్న సమయంలో కొందరు బీజేపీ నాయకులు అక్కడకు వచ్చి అడ్డుకున్నారు. కార్పొరేషన్‌లో ఎన్నో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, వాటన్నింటినీ కూల్చివేశాకే ఈ నిర్మాణం దగ్గరకు రావాలని, అప్పటిదాకా ఎవరు వచ్చినా ఊరుకునేది లేదని నేతలు మునిసిపల్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. దాంతో చేసేది లేక సిబ్బంది వెనుదిరిగారు. కాగా సదరు ప్లాటుకు సంబంధించిన సరైన పత్రాలతో ఎవరైనా వస్తే వారికి అనుమతి ఇవ్వాలని, ఎవరూ రాకపోతే దానిని మునిసిపల్ అధికారులు స్వాధీనం చేసుకుని ప్రజోపయోగార్థం వినియోగించుకోవాలని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరుతున్నారు. మరి అధికారులు దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే..!


అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయిస్తున్న మీర్‌పేట్ మునిసిపల్ అధికారులు

ఎల్బీనగర్ నిధులను పాతబస్తీకి మళ్లించొద్దు : బీజేపీ

● బీఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ పోకడలంటూ విమర్శ
● అధికారుల వైఖరిని నిరసిస్తూ జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా

ఎల్‌బీనగర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పరిధిలో ప్రజల నుంచి పన్ను రూపేణ వసూలు చేస్తున్న నిధులను పాతబస్తీకి మళ్లించకుండా ఈ ప్రాంత అభివృద్ధికే కేటాయించాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఆరు నెలలుగా అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేటర్లంతా కలిసి జోనల్ కార్యాలయం ఎదుట బుధవారం పెద్ద ఎత్తున ధర్నా, ఆందోళన చేపట్టారు. జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌ను కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, వంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సైతం ఎల్బీనగర్ జోనల్ పరిధిలో వసూలు చేసిన పన్నులను పాతబస్తీకి మళ్లించిందని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అలాగే వ్యవహరించడం దారుణమన్నారు. ఇలా నిధులు దారి మళ్లించడం ద్వారా శివారు ప్రాంతాలైన మన్సూరాబాద్, హయత్‌నగర్, నాగోల్, బీఎన్‌రెడ్డినగర్, వనస్థలిపురం, కొత్తపేట, గడ్డిఅన్నారం, చైతన్యపురి, సరూర్‌నగర్, ఆర్‌కేపురం తదితర డివిజన్లు అభివృద్ధికి నోచుకోవడంలేదన్నారు. పది నెలలుగా వీధిదీపాల నిర్వహణ, సీసీరోడ్ల నిర్మాణపు పనులతో పాటు పారిశుధ్య నిర్వహణ సైతం సరిగ్గా చేపట్టలేని దుస్థితి నెలకొందన్నారు. జోనల్ కమిషనర్‌గా ఐఏఎస్ వస్తే అభివృద్ధి పరుగులు పెడుతుందని సంతోషించాము కానీ నిధులు కూడా మంజూరు చేయలేని దుస్థితి జీహెచ్ఎంసీలో నెలకొన్నదన్నారు. ఈ ప్రాంతంలో వసూలు చేసే పన్నులను పాతబస్తీకి మళ్లించకుండా ఈ ప్రాంతానికే కేటాయించాలని డిమాండ్ చేశారు. నిధులు కేటాయించలేనప్పుడు ప్రజల వద్ద పన్నులను కూడా వసూలు చేయవద్దని వారు సూచించారు. అనంతరం వారు జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగ మధుసూదన్‌రెడ్డి, నాయకోటి పవన్‌కుమార్, చింతల అరుణాసురేందర్ యాదవ్, ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, రంగా నర్సింహగుప్తా, కళ్లెం నవజీవన్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, ఆకుల శ్రీవాణి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్‌యాదవ్ పాల్గొన్నారు.


సామ రంగారెడ్డితో కలిసి జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి జెడ్సీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్లు

బడంగ్‌పేట్‌లో దశలవారీగా అభివృద్ధి పనులు

● మేయర్ పారిజాతారెడ్డి వెల్లడి

సరూర్‌నగర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి అన్నారు. బడంగ్‌పేట్ 23వ డివిజన్‌లోని వైష్ణవి కాలనీలో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ పనులను బుధవారం కార్పొరేటర్ రాళ్లగూడెం సంతోషీశ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కాలనీల్లో అంతర్గత రోడ్లు నిర్మిస్తూ డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచడానికి కృషిచేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గట్టు బాలకృష్ణ, కుమార్, కాలనీప్రతినిధులు పాల్గొన్నారు.


కమ్యూనిటీ హాల్ పనులను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

శ్రీవిద్య టౌన్‌షిప్‌లో సీసీ రోడ్డు పనులు

బడంగ్‌పేట్ 20వ డివిజన్‌లోని శ్రీవిద్య టౌన్‌షిప్‌లో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను బుధవారం కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డితో కలిసి మేయర్ పారిజాతానర్సింహారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్‌రెడ్డి, నాయకులు సమరసింహారెడ్డి, మనోహర్, గోపాల్, మిట్టు పాల్గొన్నారు.

అరవింద్‌నగర్‌లో యూజీడీ పనులు

అల్మాస్‌గూడ 26వ డివిజన్‌లోని అరవింద్‌నగర్‌కాలనీలో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు బుధవారం కార్పొరేటర్ రామిడి కవితారాంరెడ్డితో కలిసి మేయర్ పారిజాతారెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, గుర్రం లక్ష్మారెడ్డి, జెల్ల రమేశ్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, కాలనీప్రతినిధులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భరోసానిచ్చేలా పోలీసింగ్ ఉండాలి

● సీపీ సుధీర్‌బాబు

కొత్తపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పోలీసింగ్ ప్రజల శాంతి భద్రతలకు భరోసానిచ్చేలా ఉండాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు సూచించారు. బుధవారం రాత్రి ఆయన ఎల్బీనగర్ పీఎస్‌ను ఆకస్మికంగా సందర్శించారు. పీఎస్ రిసెప్షన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్‌తో చెప్పారు. అనంతరం ఆయన రైటర్స్ డెస్క్ వద్ద వారి పనితీరును పరిశీలించారు. పోలీసింగ్ పనికి వచ్చే ఏ మంచి విషయాన్నైనా అనుసరించాలన్నారు. పీఎస్ పరిధిలో నిర్లక్ష్యానికి గురై ఒంటరిగా ఉండు వృద్ధుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మాదక ద్రవ్యాల రవాణా అంశాలనూ పరిశీలించాల్సిన నేపథ్యంలో పీఎస్ పరిధిలోకి వచ్చే జాతీయ రహదారిపైన వాహనాల రాకపోకలపై దృష్టిపెట్టాలన్నారు. ట్రాన్స్‌జెండర్స్‌కు పునరావాసం కల్పించే విషయంలోనూ సహకరించాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ రద్దీని నివారించడంలో ట్రాఫిక్ పోలీసులతో సమన్వయంగా విధులు చేపట్టాలన్నారు. పీఎస్ పరిధిలో గల రౌడీ షీటర్స్ పైన నిఘా పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ కృష్ణయ్య, ఎస్‌హెచ్ఓ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


డీసీపీ, ఏసీపీలతో మాట్లాడుతున్న సీపీ సుధీర్‌బాబు

క్యాలెండర్ ఆవిష్కరణ

వనస్థలిపురం : వెంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరు సుఖఃసంతోషాలతో జీవించాలని పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ గౌరవ చైర్మన్ రంగినేని వెంకట్‌రావు, చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య తెలిపారు. బుధవారం వనస్థలిపురం రెడ్‌వాటర్ ట్యాంక్ సమీపంలోని పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ 2025 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

రాజ్‌భవన్‌కు కాంగ్రెస్ శ్రేణులు

అబ్దుల్లాపూర్‌మెట్ : ఏఐసీసీ పిలుపు మేరకు బుధవారం నెక్లెస్ రోడ్డు నుంచి చేపట్టిన చలో రాజ్‌భవన్ కార్యక్రమానికి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీగా వెళ్లారు.

వృద్ధుడి అదృశ్యం

హయత్‌నగర్ : వృద్ధుడు అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ విజయనగర్‌కాలనీలో నివాసం ఉండే దైద భిక్షం(70) మంగళవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం భిక్షం కొడుకు పాపయ్య తన తండ్రి కనిపించడం లేదని హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్నిఫర్ డాగ్‌లతో తనిఖీ

● డ్రగ్స్ వినియోగాన్ని గుర్తించేందుకు
● న్యూ ఇయర్ కార్యక్రమాలకు అనుమతి తీసుకోవాలి
● ఈవెంట్ల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి : సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): న్యూ ఇయర్ ఈవెంట్లలో డ్రగ్స్ వినియోగాన్ని గుర్తించేందుకు స్నిఫర్ డాగ్స్‌తో తనిఖీలు చేపట్టనున్నామని, డ్రగ్స్ తీసుకున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు హెచ్చరించారు. కొత్త ఏడాది సందర్భంగా పలు కార్యక్రమాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు 12 రోజుల ముందే అనుమతి తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ జాం కాకుండా చూడటంతోపాటు మద్యం తాగి వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్‌పై ప్రత్యేక తనిఖీలుంటాయన్నారు. ఈ వెంట్లు నిర్వహించే సమయంలో నిబంధనలు పాటించాలని, పార్కింగ్, ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వాటి రికార్డింగ్‌ను భద్రపరచాలని సూచించారు. ఈ వెంట్ల వద్ద ట్రాఫిక్ జాం కాకుండా ప్రైవేటు సెక్యూరిటీని నియమించుకోవాలన్నారు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా డీజే సౌండ్ ఉండాలన్నారు. రాత్రి 10 గంటలకు పెద్ద శబ్దం వచ్చే యాంప్లిఫయర్లు ఆపేయాలన్నారు. మద్యం సరఫరా చేసే ఈవెంట్లలో మైనర్లకు ప్రవేశం లేకుండా చూడాలన్నారు. పార్టీలో డ్రగ్స్ వినియోగించకుండా చూసే బాధ్యత నిర్వాహకులదేనన్నారు. ఈవెంట్లలో మహిళల భద్రతకు షీటీమ్స్ అన్ని ప్రాంతాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. అసభ్యకర నృత్యాలకు తావులేదని, నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సీపీఐ శతాబ్ది ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

సరూర్‌నగర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 26వ తేదీన నిర్వహించనున్న శతాబ్ది ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను బుధవారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్‌లో గల పార్టీ బాలాపూర్ మండల సమితి కార్యాలయంలో ఆవిష్కరించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రవీంద్రాచారి పాల్గొని మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న పార్టీ సీపీఐ అని, ఇది పీడిత ప్రజల అభిమాన పార్టీ అని అన్నారు. ఈనెల 26వ తేదీన జరుగనున్న శతాబ్ది ఉత్సవాల్లో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జె.శివనాయక్, చత్రునాయక్, రైతు సంఘం జిల్లా నాయకుడు పిచ్చిరాజు, రెడ్యానాయక్, వీరస్వామి, మొగులయ్య, శ్రీనివాస్, శ్రీనునాయక్, నందు, విజయ్, లక్ష్మమ్మ, కృష్ణకుమారి పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నేతలు

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం

చంపాపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో సంకష్ట హర చతుర్థిని పురస్కరించుకొని బుధవారం సకల సంకటాలను తొలగించే హోమం గణపతి హోమాన్ని ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ఉదయం పండితులు, అర్చకులు గణపతిస్వామి వారి మూల విరాట్టుకు ప్రాతఃకాల అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్.లావణ్య, వేద పండితులు చంద్రకాంత్‌శర్మ, దైత పవన్‌కుమార్, అర్చకులు కందాళ సంతోష్‌కుమార్, జీ.శ్రీనివాస్, ఆలయ సిబ్బంది వెంకటయ్య, జీ.రమాదేవి, టీ.వేణుగోపాల్ పాల్గొన్నారు.

నవగ్రహాలు, నందీశ్వర విగ్రహం ప్రతిష్ఠ

హయత్‌నగర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ మునగనూర్‌లోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం వద్ద బుధవారం నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన, నందీశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ అపెక్స్ బ్యాంకు వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య హాజరై నవగ్రహ, నందీశ్వరస్వామిలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు వేముల స్వాతి అమరేందర్‌రెడ్డి, సంగీత మోహన్‌గుప్తా, ఆలయ కమిటీ నాయకులు మేకం లక్ష్మయ్య, ధనమ్మ, వేముల భాస్కర్‌రెడ్డి, గుత్తా వెంకటరెడ్డి, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

అనాథలకు నిత్యావసరాలు, నోట్‌బుక్‌ల పంపిణీ

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అనాథ పిల్లలకు ఆసరాగా నిలవడం అభినందనీయం అని అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లిలోని అవంతి కళాశాల ఎలక్ట్రానిక్ విభాగం విద్యార్థుల ఆధ్వర్యంలో అనాథ పిల్లలకు నిత్యావసరాలతో పాటు నోట్‌బుక్‌లను శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. విద్యార్థులు చదువుతో పాటు సేవా భావాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్ డాక్టర్ రాంచంద్రారెడ్డి, కిశోర్‌రెడ్డి, పీఆర్ఓ శ్రీనివాస్‌నాయుడు పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి : బాలకిషన్

ఎల్‌బీనగర్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను హేళన చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బేషరతుగా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని మాలల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేర బాలకిషన్ డిమాండ్ చేశారు. బుధవారం సరూర్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ ఆది నుంచి కూడా అంబేడ్కర్ అన్నా కోట్లాది దళిత జాతి అన్నా బీజేపీకి చిన్నచూపేనన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలతో బీజేపీ నిజస్వరూపం బయటపడిందన్నారు. దేశంలో దళితులను చీల్చి వర్గీకరణ పేరుతో రాజకీయాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలోని మాలలమంతా గ్రామగ్రామాన అంబేడ్కర్ విగ్రహాల వద్ద నిరసన తెలుపుతామన్నారు.


మాట్లాడుతున్న మాలల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బాలకిషన్

పేదింటి పెళ్లికి ఉప్పల ఫౌండేషన్ చేయూత

మన్సూరాబాద్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఉప్పల ఫౌండేషన్ చేయూతనందిస్తోందని ఇంటర్నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. చింతల్‌లో నివాసముండే పేదింటి వైశ్య సామాజిక వర్గానికి చెందిన పద్మ, లక్ష్మణ్‌రావు దంపతుల కుమార్తె లక్ష్మీఅనూషకు వివాహం నిశ్చయమైంది. విషయం తెలుసుకున్న శ్రీనివాస్‌గుప్తా బుధవారం నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో తల్లిదండ్రుల సమక్షంలో లక్ష్మీఅనూషకు పుస్తె, మెట్టెలు, చీరగాజులు అందజేశారు. కార్యక్రమంలో విప్లవ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా విజయభాస్కర్

సైదాబాద్: తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్(టీఆర్‌టీఎఫ్) హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మలక్‌పేటకు చెందిన డాక్టర్ ఎస్. విజయభాస్కర్ ఎన్నికయ్యారు. బుధవారం మలక్‌పేటలోని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్ ప్రకటించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ భాష పండితులకు స్కూల్ అసిస్టెంట్ భాషలుగా పదోన్నతులు ఇవ్వడంలో విజయ్‌భాస్కర్ పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. తెలంగాణలో పీఆర్సీ గడువు ముగిసిందని నూతన పీఆర్సీని అమలు చేయాలని కోరారు.


పోలీసుల అదుపులో సట్టా నిర్వాహకులు, పంటర్లు, స్వాధీనం చేసుకున్న సామగ్రి

సట్టా నిర్వహిస్తున్న ముఠా అరెస్ట్

● నిర్వాహకులతోపాటు పంటర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా సట్టా నిర్వహిస్తున్న నిర్వాహకులతో పాటు పంటర్లను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్, షాహినాత్ గంజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ధూల్‌పేట జుమ్మేరాత్‌బజార్ ప్రాంతానికి చెందిన విశాల్ సింగ్(26) విగ్రహాల తయారీతో పాటు, విక్కీ పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. అదనపు సంపాదన కోసం పాన్‌షాప్‌లో ఉన్న గదిలో సట్టా బెట్టింగ్‌లు తీసుకుంటున్నాడు. ఇతడికి తాడ్‌బన్‌కు చెందిన నరేష్‌కుమార్‌చౌహాన్(24), ధూల్‌పేటకు చెందిన అంకిత్ సింగ్ (22), అక్షయ్ సింగ్(26)లు పంటర్ల నుంచి బెట్టింగ్‌లు తీసుకుంటూ సహకరించేవారు. వీరి దందా గురించి పక్కా సమాచారమందుకున్న సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్, షాహినాత్ గంజ్ పోలీసులు కలిసి నలుగురు నిర్వాహకులతో పాటు మరో 20 మంది పంటర్లను అరెస్ట్ చేశారు. వీరి నుంచి మట్కా లాటరీ చార్ట్, లాటరీ చిట్టు, సట్టా చిట్టు, రూ.30,760 స్వాధీనం చేసుకున్నారు.